ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 27 డిసెంబరు 2024


కలిసిరాని కాలం



- ఈ యేడు రైతన్నకు చేదు అనుభవాలు
- అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నష్టం
- పత్తి దిగుబడులు అంతంత మాత్రమే
- నష్టాలు మిగిల్చిన మామిడి
- అందని పెట్టుబడి సాయం.. కొందరికే రుణమాఫీ

కాల ప్రవాహంలో మరో సంవత్సరం కలిసిపోతోంది. కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో స్వాగతం చెప్పేందుకు ప్రజలు సిద్ధమతున్నారు. ఈ యేడు రాజకీయంగా,అభివృద్ధిపరంగా పలు సంఘటనలు జరిగాయి. వీటిని ఒకసారి 'యాది' చేసుకుందాం.. ఈ సంవత్సరం పలు రంగాల్లో జరిగిన సంఘటనలు, ఆసక్తికర పరిణామాలను 'ఆంధ్రజ్యోతి' మీకు అందిస్తోంది...





నెన్నెల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ యేడు వ్యవసాయ రంగం పలు ఒడిదొడుకులకు లోనైంది. ప్రతికూల పరిస్థితులతో ప్రధాన పంటలైన వరి, పత్తి, మామిడి నష్టాలనే మిగిల్చాయి. వానాకాలం సీజన్‌లో ఎడతెరిపి లేని వర్షాలు పంటలను దెబ్బతీశాయి. చేతి కొచ్చే సమయంలో కురిసిన వానలకు కోతదశలో ఉన్న వరి నేలవాలగా పత్తి తడిసి నల్లబడింది. కల్లాల్లోని ధాన్యం తడిసి నష్టపోయారు. మామిడి రైతులకు నిరాశే మిగిలింది. పూత, కాత అంతంత మాత్రంగానే వచ్చింది. తేనెమంచు, పండు ఈగ దాడిలో పంట దెబ్బతిన్నది. కాసిన కొన్ని కాయలను ఈదురుగాలులు ఊడ్చుకెల్లాయి. పంట రుణమాఫీ అందరికి వర్తించక పోగా, చాలా మంది కార్యాలయాలు, బ్యాంకుల చుట్టు తిరిగినా లాభం లేకుండాపోయింది. రూ.2 లక్షలకు పైన అప్పు ఉన్న రైతులకు మాఫీపై స్పష్టత లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతుభరోసా పథకంలో వానాకాలం పెట్టుబడికి సాయం అందకపోగా.. యాసంగి పనులు కొనసాగుతున్నప్పటికి ఇప్పటికి పథకం అమలుకు నోచుకోవడం లేదు.

వ(అ)రి గోస

జిల్లాలో 1.64 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ప్రభుత్వం సన్నాలకు రూ. 500లు బోనస్ ప్రకటించడంతో 80 శాతం రైతులు సన్నాలనే సాగు చేశారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని పంటను దక్కించుకున్న రైతులకు దిగుబడి చేతికొచ్చే సమయంలో అకాల వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. కోతకొచ్చిన పొలాలు నేలవాలాయి. పంటనష్టం సర్వే చేసినప్పటికీ పరిహారం ఇంతవరకు అందలేదు. అష్టకష్టాలు పడి సాధించిన దిగుబడులు అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.500లు బోనస్ ప్రకటించడంతో గిట్టుబాటు అవుతుందని ఆశపడిన రైతులకు నిబంధనలు గుదిబడలా మారాయి. తేమ, తాలు, తప్ప, నూక పేరిట ధాన్యాన్ని తిరస్కరిస్తున్నారు. జిల్లాలో 3.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా 41,307 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.

సీజన్ ముగింపు దశకు వచ్చినప్పటికి సేకరణ లక్ష్యంలో 20 శాతం కూడా దాట లేదు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలతో రైతులకు ఏమేర ప్రయోజనం చేకూరతుందో అర్థం చేసుకోవచ్చు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు ధర తగ్గించారు. సన్నాలను క్వింటాలుకు రూ. 2800లకు కొనుగోలు చేసిన మిల్లర్లు ప్రస్తుతం రూ. 2600లకే తీసుకుంటున్నారు. తరుగు పేరిట కేజీ ఎక్కువ కాంటా పెడుతున్నారు. మబ్బులు కమ్ముకొని ఉండటం, వర్షాలు కురుస్తుండటంతో మద్దతుధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తోంది. చాలా మంది రైతులు ఇప్పటికి కల్లాల్లోనే ధాన్యం రాశులు పోసుకొని కొనేవారి కోసం ఎదురు చూస్తున్నారు.

తెల్లబోయిన పత్తి రైతు

జిల్లాలో ఈ సీజన్‌లో 1,73,713 ఎకరాల్లో పత్తి సాగయింది. ప్రభుత్వ అనుమతి లేని గ్లైసిల్ (బీజీ-3) విత్తనాలనే ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. కలుపు బెడద ఉండదని కూలీల ఖర్చులు తగ్గుతాయని భావించిన రైతులు అధిక ధరలు చెల్లించి ఈ విత్తనాలను ఎగబడి కొనుగోలు చేశారు. చెట్లు 6 నుంచి 8 ఫీట్ల ఎత్తుకు పెరిగాయి కాని పూత, కాత లేక చాలా మంది రైతులు నష్టపోయారు. చెట్టుకు 80 నుంచి 100 కాయలు ఉంటే ఎకరానికి 9 నుంచి 11 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుంది. కాని 30 నుంచి 60 కాయలు మాత్రమే ఉండటంతో ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. పత్తి చేతికొచ్చే సమయంలో అకాల వర్షంతో తడిసి నల్లబడింది. ప్రభుత్వం పత్తికి మద్దతు ధరగా క్వింటాలుకు రూ. 7,521 ప్రకటించింది. బహిరంగ మా ర్కెట్లో ధర లేక పోవడం తో రైతులు సీసీఐకే అమ్ముకోవాల్సి వస్తోంది. తేమ, నాణ్యత పేరిట ధరలో కోతలు పెట్టడం... వారంలో మూడు రోజులు మాత్రమే కొను గోలు చేయడం.. రోజుకు కొన్ని బండ్లను మాత్రమే అను మతిస్తుండటంతో రైతులు పత్తి విక్రయంలో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు.

మిగతా 7వ పేజీలో


వర్షానికి దెబ్బతిన్న పత్తిపంట, ఈదురు గాలులకు నేలరాలిన మామిడి

భారీగా పెరిగిన ఖర్చులు

సాగుకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, యంత్రాల కిరాయి రూపంలో పెట్టుబడులు రెట్టింపయ్యాయి. బురద పొలాల్లో కోసే చైన్ మిషన్‌కు గంటకు రూ. 3000లు ఉన్న ధరను రూ. 4000లకు పెంచారు. కంబైన్డ్ హార్వెస్టర్ ధర గంటకు రూ. 1800ల నుంచి రూ. 2200లకు పెంచేశారు. ఫోర్‌వీల్ హార్వెస్టర్‌కు గంటకు రూ. 3 వేలు వసూలు చేశారు. వరి కోతలు, పత్తి సేకరణ ఏక కాలంలో రావడంతో కూలీల కొరత వేధించింది. అధిక ధరలు చెల్లించి మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యాణా రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకురావాల్సి వచ్చింది. వారికి క్వింటాలుకు రూ.వెయ్యి నుంచి రూ.1200లు చెల్లించాల్సి వస్తోంది. అన్నింటికి ధరలు పెరగడంతో పెట్టుబడులకు మద్దతు ధరలు సరితూగడం లేదని, నికరంగా తమకు నష్టాలే దిగుబడులవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఒంటికాలిపై నిల్చొని... నిరసన తెలిపి


శిబిరంలో ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లో కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ఉద్యోగులు శిబిరంలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామని జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు వెల్లడించారు. శిబిరాన్ని డె మోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి జయప్రకాష్, నాయకులు శ్రీనివాస్, జాకీర్, టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజావేణు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపి ఆర్థిక సహాయాన్ని అందించారు.

డిప్యూటేషన్ ఆదేశాలను విరమించుకోవాలి

గర్మిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలకు ఉపాధ్యాయుల డిప్యూటేషన్ ఆదేశాలను విరమించుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాపులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమగ్ర శిక్ష అభియాస్ ఉద్యోగులు 18 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఉద్యోగులను చర్చలకు పిలువకుండా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కస్తూర్బా పాఠశాలలకు పంపించే ఉత్తర్వులు జారీ చేయడం సరి కాదన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

చెన్నూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఆరోగ్యబీమా, కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బాధ్యతలను కేటాయించడాన్ని ఖండిస్తున్నామని, దీని వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. నాయకులు సింగిరెడ్డి సాంబయ్య, తోడె తిరుపతి, చందు, సురేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్యాంకు సేవలకు అంతరాయం

దండేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)లో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు సేవల్లో అంతరాయం ఉంటుందని బ్రాంచ్ మేనేజర్ భూమారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్(ఏపీజీవీబీ) బ్యాంకును తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్నందున అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఖాతాదారులు దీనిని గమనించి సహకరించాలన్నారు. జనవరి 1నుంచి బ్యాంకు సేవలు యథావిధిగా పని చేస్తాయన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి


నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీరాంపూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సీఐటీయూ నస్పూర్ మండల కన్వీనర్ కాసిపేట రాజేశం డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఫ్లకార్డులతో జరిగిన నిరసనలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించే విధంగా అమిత్ షా మాట్లాడారన్నారు. ఇది బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. ఆయన బహుజనులకు క్షమాపణ చెప్పా లని, వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, సతీష్, సంపతి, రమేష్, సురేష్, శీను, మహేష్, పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ వందేళ్ళ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, తదితరులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ళ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ ప్రజలు, కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారం పోరాటాలు చేస్తుందన్నారు. ఈ నెల 30న నల్లగొండ జిల్లాలో జరిగే పార్టీ ఆవిర్భావ ప్రారంభోత్సవ బహిరంగ సభ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, మల్లయ్య, రవి, నగేష్, పొలు, పోచన్న, శంకరయ్య, పోశం, రాయమల్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ళ ఉత్సవాలను సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, మిట్టపల్లి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్పనర్సయ్యలు జెండాను ఆవిష్కరించారు. సీపీఐ ప్రజల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు అనేక పోరాటాలు చేసిందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బాబు, లక్ష్మీనారాయణ, చంద్రమాణిక్యం, ఉపేందర్, రాజేష్, సోని, సరోజ, రాజం పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నస్పూర్ కాలనీ, గోదావరి కాలనీ, నాగార్జు కాలనీల్లో అరుణ పతాకాలను ఎగురవేశారు. నస్పూర్‌కాలనీ, నాగార్జునకాలనీల్లో మిర్యాల రాజేశ్వర్ రావు, కంచం పోశంలు, షిర్కే సెంటర్‌లో కలవేన శంకర్‌లు ఎగురవేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ సీపీఐ పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు రవి, రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేష్, బాజీ సైదా పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో నిర్వహించారు. మండల కార్యదర్శి దాగం మల్లేష్ సీపీఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. గట్టయ్య, దాగం రాజలింగు, సత్తయ్య, దుర్గం పోచం, సుధాకర్, పాల్గొన్నారు.

విలీన సభ పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లో జరిగే న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ పోస్టర్లను గురువారం మంచిర్యాలలోని మార్క్స్‌భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్ విడుదల చేశారు. ఈ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, బ్రహ్మానందం, మల్లన్న, జ్యోతి, శ్రీకాంత్, అరుణ, సురేందర్, సారన్న, సైయాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి

- ముగిసిన జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలు


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, గెలుపొందిన కేరళ మహిళ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్

బెల్లంపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రతీ ఒక్కరు వారి జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మూడు రోజులుగా పట్టణంలోని తిలక్ మైదానంలో నిర్వహిస్తున్న 9వ జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతల బహుమతి కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రతీ ఒక్కరికి శారీరకంగా మానసికంగా ధృఢంగా ఉండడానికి దోహదం చేస్తాయన్నారు. క్రీడలు క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సైతం వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం పోటీల్లో విజేతలైన సబ్ జూనియర్ బాలురు, బాలికల విభాగాల్లో కేరళ, అలాగే యూత్ మహిళ, పురుషుల విభాగంలో కేరళ జట్లు విజేతగా నిలిచాయి. గెలిచిన జట్లకు కలెక్టర్ ట్రోఫీలు అందజేశారు. రాష్ట్ర సాఫ్ట్ బేస్‌బాల్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి గురువేందర్, ట్రెజరర్ దివాకర్, జిల్లా త్రోబాల్ సెక్రటరీ యాదండ్ల బలరాం, నాయకులు నాతరి స్వామి, మునిమంద రమేష్, వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.

-క్రీడల్లో ప్రతిభ చాటిన జట్లు

9వ జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో సబ్ జూనియర్ బాలుర విభాగంలో మొదటి స్థానంలో కేరళ, ద్వితీయ మహారాష్ట్ర, తృతీయ తెలంగాణ నిలిచింది. సబ్ జూనియర్ బాలికల విభాగంలో ప్రథమ కేరళ, ద్వితీయ తెలంగాణ, తృతీయ మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి. యూత్ పురుషుల విభాగంలో ప్రథమ కేరళ, ద్వితీయ తెలంగాణ, తృతీయ మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి. యూత్ మహిళవిభాగంలో ప్రథమ కేరళ, ద్వితీయ తెలంగాణ, తృతీయ మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి.

జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలి

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. ఈ నెల 27వ తేదీ కరీంన గర్, వరంగల్, హైద్రాబాద్‌లలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు బయలుదేరుతున్న బస్సులను గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ, మండల, మున్సిపల్ జిల్లా స్థాయిల్లో వివిధ క్రీడల్లో పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. జిల్లా నుంచి 190 మంది క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 2, 2025 జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ పెరుగుతుందని తెలిపారు. జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి రాజ్‌వీరు, అధికారులు దుర్గాప్రసాద్, పురుషోత్తం నాయక్, నీరటి రాజేశ్వరి, రొఫ్‌ఖాన్ పాల్గొన్నారు.


బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి

కాసిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి పేర్కొన్నారు. గురువారం దేవాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు, పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ. 10 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మరచి పోయిందన్నారు. పురుగుల బియ్యంతో వంట చేయలేక అవస్థలు పడుతున్నామన్నారు. నాణ్యమైన బియ్యం అందించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. సముద్రుబాయి, సాయక్క, వెంకమ్మ, మణెమ్మ, కమలాబాయి, పోసక్క తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


సత్యనారాయణ (ఫైల్)

తాండూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టం పేటకు చెందిన ఉరడి సత్యనారాయణ(37) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలీ పనులు చేస్తూ జీవిస్తున్న సత్యనారాయణ ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఐదుగురు కూతుళ్ల వివాహాలు ఎలా చేయాలో అనే దిగులుతో బాధపడే వాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన సిద్దార్ద్ (18) అనే యువకుడు బుధవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దార్ద్ కాల్‌టెక్స్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న రైల్వే ట్రాక్‌పై మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

కాసిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్ పంచాయతీ అచ్యుతరావుగూడెంకు చెందిన ఆత్రం సత్తుబాయి ఇల్లు ప్రమాదవశాత్తూ గురువారం రాత్రి దగ్ధమైపోయింది. మంటలను గమనించిన స్థానిక యువకులు ఆర్పే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు ఎక్కువై ఎవరు వెళ్లలేదు. బాధితురాలు సత్తుబాయి తెలిపిన వివరాల ప్రకారం ఇంటి సమీపంలో పుట్టిన రోజు వేడుకలు జరుగుతుండగా తాను వెళ్లానని, ఇంటికి మంటలు అంటుకుని కనిపించడంతో పరిగెత్తుకు వచ్చానని తెలిపింది. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు ఎక్కువయ్యాయి. దీంతో ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందో స్పష్టత రాలేదు. నిరుపేద కుటుంబానికి చెందిన తనను ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

చైనా మాంజాతో ప్రాణాలకు ముప్పు


తాళ్ళపేటలో కిరాణ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ రేంజ్ అధికారి సాగరిక, ఎఫ్‌బీవో

దండేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, యవకులు ఎగరవేసే గాలిపటాలకు చైనా మాంజా దారాలతో ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని తాళ్ళపేట అటవీ రేంజ్ అధికారి సుష్మారావు అన్నారు. గురువారం తాళ్ళపేటలో కిరాణ షాప్‌ల్లో తనిఖీలు చేపట్టారు. మాంజా దారంతో గాలిపటం ఎగరవేసినప్పుడు మనుషులకు, పక్షులకు చుట్టుకుంటే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుందన్నారు. చైనామాంజా అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. డిప్యూటీ ఆర్‌వో సాగరిక, ఎఫ్‌బీవో రహీముద్దీన్ ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్‌సర్చ్


మాట్లాడుతున్న మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్‌సర్చ్ నిర్వహిస్తున్నామని సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దనపల్లిలో నార్కోటిక్ డాగ్ సిబ్బందితో కలిసి కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత కోసమే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కొత్తగా ఎవరైనా ఇండ్లు అద్దెకు అడిగితే వారి ఆధార్‌కార్డు, వివరాలను తెలుసుకుని ఇవ్వాలన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడల్లో రాణించాలన్నారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే అనుమానాస్పద మెసేజ్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. వాహన పత్రాలు, నెంబరు ప్లేట్లు లేని 27 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలకు జరిమానా విధించారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, దేవాపూర్ ఎస్‌ఐ ఆంజనేయులు, పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

కన్నెపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : టేకులపల్లి గ్రామంలోని పెట్రోలు బంకు ఎదుట టీ జంక్షన్ వద్ద గురువారం గంజాయి పట్టుకున్నట్లు ఎస్‌ఐ గంగారాం తెలిపారు. గంజాయి తరలిస్తున్నారని సమాచారం మేరకు తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఈజ్‌గాం గ్రామానికి రాజు సర్కార్, శామీర్ బరాయిలు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని తనిఖీ చేయగా 1100 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎస్‌టీపీపీ కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలయ్యాయి. జైపూర్ మడలం టేకుమట్ల గ్రామానికి చెందిన ఇందారపు సంతోష్ కాంట్రాక్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీరాంపూర్ వచ్చి తిరిగి టేకుమట్లకు వెళ్తుండగా జీఎం కార్యాలయం వద్ద గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. గాయపడిన అతన్ని కరీం నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి

కన్నెపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : లింగాల పంచాయతీ పరిధిలోని నాగపెల్లికి చెందిన లాట్కరి కృష్ణయ్య అనే రైతుకు చెందిన మేక గురువారం విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. మేక విలువ సుమారు రూ. 12 వేలు ఉంటుందని పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

- జిల్లాలో ఊహించని రాజకీయ మలుపులు..
- అధికారపార్టీకి ఎమ్మెల్యేలు సున్నా
- ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్, సిర్పూర్‌లో బీజేపీ ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం
- పట్టుకోసం కాంగ్రెస్ ప్రయత్నం
- మారిన రాజకీయ సమీకరణాలు
- డీలాపడిన బీఆర్‌ఎస్
- కాంగ్రెస్‌లో వర్గపోరు
- 2024లో ప్రధానపార్టీలకు చేదు అనుభవం





పదవి కోసం.. పట్టు కోసం..

ఆసిఫాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాలగర్భంలో 2024కలిసి పోనుంది. ఏడాదిలో జిల్లాలో రాజకీయ సమీకరణాలు ఊహించని మలుపులు తిరిగాయి. జిల్లాలో ముఖ్యనాయకులు పార్టీలను.. రంగు మార్చిన విధంగా తమకు అనుకూలంగా మార్చుకొని పార్టీలు మారారు. డిసెంబరు 2023లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో అధికార పార్టీకి జిల్లా ఓటర్లు మొండి చేయి ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా ఉండగా జిల్లాలో మాత్రం విలక్షణ తీర్పును ఇచ్చారు. దీంతో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యేగా బీజేపీ నుంచి పాల్వాయి హరీష్‌బాబు గెలుపొందారు. కాంగ్రెస్‌పార్టీకి జిల్లాలో ఎమ్మెల్యే స్థానాలు దక్కలేదు. ఆ తర్వాత జిల్లాలో రాజకీయ సమీకరణాలు కొత్త మలుపులు తిరిగాయి. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లాలోని ఆయాపార్టీల ముఖ్య నేతలను తమవైపు తిప్పుకున్నారు. దీంతో ఆయాపార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి నాయకుల వలసలు పెరిగాయి.

అధికార పార్టీకి దక్కని ఎమ్మెల్యే పదవులు..

గతఅసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీకి జిల్లాలోని రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యే పదవులు దక్కలేదు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నుంచి కోవ లక్ష్మి, కాంగ్రెస్ నుంచి ఆజ్మీర శ్యాంనాయక్, బీజేపీ నుంచి ఆత్మారాం నాయక్ పోటీచేశారు. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి శ్యాం నాయక్‌పై బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి 20వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. అలాగే సిర్పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కోనేరు కోనప్ప, కాంగ్రెస్ అభ్యర్థిగా రావి శ్రీనివాస్, బీజేపీ అభ్యర్థిగా పాల్వాయి హరీష్‌బాబు, బీఎస్పీ నుంచి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలో నిలువగా మూడువేల పైచిలుకు ఓట్లతో బీఆర్‌ఎస్‌పై బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు గెలుపొందారు. దీంతో అధికార పార్టీ అయిన కాంగ్రెస్ రెండు నియోజకవర్గాల్లో ఓటమి పాలయింది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగినా జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు ఇచ్చిన విలక్షణ తీర్పుతో కాంగ్రెస్‌కు చేదు అనుభవం ఎదురైంది.

కాంగ్రెస్‌లో గ్రూపు విబేధాలు..

ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీలో గ్రూపు విబేధాలు గుప్పుమంటున్నాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆజ్మీర శ్యాంనాయక్ మధ్య గ్రూపు విబేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. అభివృద్ధి పనుల విషయంలో ద్వితీయ శ్రేణి నాయకులకు నామినేటెడ్ పోస్టుల కేటాయింపు విషయంలో వీరిద్దరి మధ్య విబేధాలు నెలకొన్నాయి. గతంలో జరిగిన జిల్లాస్థాయి సమగ్ర కులగణన సమావేశంలో ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు బాహాబాహీకి దిగడమే దీనికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ విషయంపై అధిష్ఠానం కూడా సీరియస్ అయిందని తెలిసింది. ఇక సిర్పూర్ నియోజకవర్గంలో కోనేరు కోనప్ప బ్రదర్స్ స్తబ్ధతగా ఉన్న సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్, ఎమ్మెల్సీ దండె విఠల్ మధ్య గ్రూపు విబేధాలు నెలకొన్నాయి.

స్థానిక ఎన్నికలపై అన్ని పార్టీల ఫోకస్..

జిల్లాలో త్వరలో జరుగనున్న స్థానికసంస్థల ఎన్నికలపై అన్నిపార్టీలు దృష్టికేంద్రీకరించాయి. జిల్లాలోని 15మండలాల్లో 335 గ్రామపంచాయతీలు ఉండగా పంచాయతీఎన్నికల్లో తమతమ పార్టీలను గెలిపించుకునేందుకు పావులు కదుపుతున్నారు. అధికారపార్టీ కాంగ్రెస్ ప్రజాసంక్షేమ పథకాలతో ముందుకు వెళ్లాలని భావిస్తుండగా బీఆర్‌ఎస్, బీజేపీలు ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు యోచిస్తోంది. పంచాయతీ ఎన్నికల తర్వాత వచ్చే ఎంపీపీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీపై ఫోకస్ పెంచింది. ఇప్పటికే గ్రామాల్లో నాయకులు కార్య కర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి అన్ని పార్టీలు సమయాత్తమవుతున్నాయి.

మారిన రాజకీయ సమీకరణాలు..

అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాలో రాజకీయ సమీకరణాలు ఊహించని రీతిలో మారిపోయాయి. పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌తో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడుగా వ్యవహరించిన ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పొత్తు పెట్టుకోవడం పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీఎస్పీ కలిసి పనిచేస్తామని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించడంతో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అసహనానికి గురయ్యాడు. అసెంబ్లీ ఎన్నికల్లో తనఓటమికి బీఎస్పీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కారణమని అతనితో కలిసి ఎంపీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకొవడంతో బీఆర్‌ఎస్ పార్టీని వీడి తన సోదరుడు ఇన్‌చార్జీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు తోపాటు తన అనుచరగనంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోనేరు కోనప్ప బీఆర్‌ఎస్ నుంచి బయటకు రావడంతో సిర్పూర్ నియోజకవర్గంలో పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది.

సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌పార్టీ కార్యకలాపాలను ఎమ్మెల్సీ దండె విఠల్ చూసు కునే వారు. ఆ తర్వాత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ నుంచి బయటకు వచ్చి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి తరపున ప్రచారం చేశారు. దండె విఠల్, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ల మధ్య సయోధ్య చెదిరిపోవడంతో ఎమ్మెల్సీ దండె విఠల్ బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, అతని సోదరుడు మాజీ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్, తన అనుచర గనంతో కలిసి పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇదేక్రమంలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, మాజీ ఎంపీపీ బాలే శ్వర్‌గౌడ్, మైనార్టీ నాయకులు, ద్వితీయ శ్రేణినాయకులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల బీఆర్‌ఎస్ మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుతం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి బీఆర్‌ఎస్‌పార్టీలో కీలకంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మరింత పట్టు సాధించేందుకు ముందుకు సాగుతోంది.

అడవికి రక్షణగా 'ట్రెంచ్'

- అక్రమ కలప రవాణాకు అడ్డుకట్ట
- రైతుల పంటలకు తప్పిన అడవిజంతువుల బెడద
- ఎంతో మేలు జరుగుతోందంటున్న అటవీఅధికారులు


కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో తవ్విన కందకం

కాగజ్‌నగర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అడవులను సంరక్షించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ట్రెంచ్(కందకాలు) వ్యవస్థను ఐదేళ్లక్రితం ఏర్పాటు చేసింది. ఫారెస్టు భూములకు హద్దులను గుర్తించి కందకాలను తవ్వించింది. జిల్లాలో ఈ ప్రక్రియ దాదాపు పూర్తికావచ్చింది. కందకాల ఏర్పాటుతో అడవిలోని తాత్కాలికరోడ్లు మూసుకుపోయాయి. అటవీశాఖ భూములు ఆక్రమణకు గురికాకుండా ఉంటోంది. అటవీప్రాంతానికి అధికారులు హద్దులు విధించి రెండుమీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో మొత్తం వంద కిలోమీటర్ల మేర ఎక్స్‌కావేటర్‌లతో అడవిచుట్టూ కందకాలను తవ్వారు. ఈ కందకాలతో ఫారెస్టు భూములకు బౌండరీ లైన్ ఏర్పాటైంది. కందకాల ఏర్పాటుతో అడవుల నుంచి కలప తరలింపునకు పూర్తి బ్రేక్ పడినట్లయింది. అదేవిధంగా వాననీటిని సంరక్షించే వీలుంది. నీటినిల్వతో అడవిలోని మొక్కలు, చెట్లకు నీటికొరత ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. కాగా కంద కాలతో అటవీ భూముల్లోని డొంకరోడ్లు పూర్తిగా మూసిపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో కొంతమంది రైతులకు ఈసమస్య తలెత్తుతోంది. కంద కాలతో అటవీశాఖ అధికారులు హద్దులు వేసి వాటిని ఆన్‌లైన్ అప్‌లోడ్ చేశారు. అటవీప్రాంతానికి ఆనుకొని ఉన్న రైతుల భూముల్లో గతంలో అడవి జంతవులు పంటనష్టం కలిగించేవి. ఇప్పుడు ఏర్పాటు చేసిన కందకాలతో పంట పొలాల్లోకి అడవి జంతువుల రావటంలేదని రైతులు పేర్కొంటున్నారు.

ట్రెంచ్‌లతో బౌండరి లైన్ ఏర్పడింది..
-వినయ్‌కుమార్ సాహు,
ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

అటవీభూముల రక్షణ కోసం ట్రెంచ్‌లను ఏర్పాటు చేశాం. ఈప్రక్రియతో ప్రధానంగా అటవీశాఖ భూములకు బౌండరి లైన్ ఏర్పడింది. అలాగే రైతుల పంట పొలాలకు వన్యప్రాణుల నుంచి ఎలాంటి ఇబ్బంది కలగడం లేదు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలు


కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న సీపీఐ నాయకులు

రెబ్బెన, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన గోలేటి కేఎల్ మహేంద్రభవన్ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ పార్టీజెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్యాగాలచరిత్ర, పోరాటాల పటిమగల పార్టీకేవలం సీపీఐ మాత్రమేనని అన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఎనలేని పోరాటం చేసినట్లు తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా రాగద్వేశాలకతీతంగా సీపీఐ పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బి జగ్గయ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యమొగిలి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు శేషరావు, జూపాక రాజేష్, కిరణ్, చంద్రోశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

దహెగాం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపినవివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గురిజాల నరేందర్ ఇంటికి అదేగ్రామానికి చెందిన వసంత కుటుంబ సభ్యులు వెళ్లి తమను అకారణంగా ఎందుకు దూషిస్తున్నావని ప్రశ్నించారు. దీంతో నరేందర్ వారిని కర్రతో బాధాడు. దీంతో వసంత, ఆమె సోదరి, నాగలక్ష్మికి గాయాలయ్యాయి. అంతేగాకుండా వసంత కుటుంబసభ్యులను చంపుతానని బెదిరించాడు. అలాగే వసంత కుటుంబసభ్యులు అయిదుగురు కర్రలతో దాడిచేయగా నరేందర్, నరేందర్ భార్య పణీంద్ర, మరొకరికి గాయాలయినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మందమర్రిలో కార్మిక సంఘాల బాయిబాట

- కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి
- ఇన్‌కంటాక్స్ రద్దు చేయాలని డిమాండ్

మందమర్రి టౌన్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికసంఘాలు బాయి బాట పట్టాయి. కార్మికులకు సంబంధించిన రెండు ప్రధానడిమాండ్లపై అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నాయి. గేట్‌మీటింగ్‌లు నిర్వహిస్తూ కార్మికులను చైతన్యం చేస్తున్నాయి. కార్మికుల సొంతింటికల అమలు చేయాలని, ఇన్‌కం టాక్సును యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్‌లలో సీఐటీయూ, ఐఎన్టీయూసీలు ఈ బాట పట్టాయి. అదేవిధంగా కార్మికులు ఉద్యోగ విరమణ అనంతరం సొంత ఇల్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

దీనిపై యాజమాన్యాలు స్పందించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే సీఐటీయూ సింగరేణి వ్యాప్తంగా సంతకాలు సేకరణ చేపట్టిందని, ముఖ్యమంత్రికి ఉత్తరాలు కూడా రాసి పంపనున్నట్లు పేర్కొంటుంది. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కూడా ప్రధానపట్టణాల్లో స్థలం ఇచ్చి బ్యాంకుల ద్వారా లోన్ ఇవ్వాలని పేర్కొంటోంది. టాక్సును యాజమాన్యం చెల్లించాలని డిమాండ్‌చేస్తోంది. ఈ రెండు డిమాండ్లపై మూడుకార్మిక సంఘాలు అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నాయి.

మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

శ్రీరాంపూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని హెచ్‌ఎంఎస్ ఏరియాఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లా డారు. కార్మికులు, వారి కుటుంబసభ్యులు అనారోగ్యంతో ఏరియా ఆస్పత్రికి వెళ్తే స్కానింగ్, ఇతరవ్యాధి నిర్ధారణ పరీక్షలకు వైద్యులు ప్రైవేటు సెంటర్లకు పంపుతున్నారన్నారు. వారు బిల్లుల రీయింబర్స్‌మెంట్ చేసుకునేందుకు శ్రీరాంపూర్ ఏరియాలో అవకాశం ఇవ్వడం లేదన్నారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే మెడికల్‌బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలని హెచ్‌ఎంఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం


రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. బుధవారం జీవీటీసీ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవీటీసీ కార్యాలయం ఉద్యోగులకు వృత్తిశిక్షణ ఇస్తూనే రక్తదానశిబిరాలకు కేంద్రంగా మారిందన్నారు. మూడునెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, రక్తదానంచేసిన వారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌పీ3 సంక్షేమాధికారికి సన్మానం

శ్రీరాంపూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఎస్‌ఆర్‌పీ3 గనిలో పనిచేసి కొత్తగూడెం ప్రధానకార్యాలయానికి బదిలీపై వెళ్తున్న ఎస్‌ఎండీ గౌస్‌పాషాను గనిలో గురువారం ఘనంగా సన్మానించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గౌస్‌పాషా ఎస్‌ఆర్‌పీ3 గనిలో పనిచేస్తూ కార్మికులు, అధికారులు, సంస్థకు వారధిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గోప్యానాయక్, ఉత్తేజ్‌రెడ్డి, సాధుల భాస్కర్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న ఆపరేటర్

మందమర్రిటౌన్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఏరియాలోని కేకేఓసీలో డంపర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న బందాల సారయ్య ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. ఈ మేరకు అవార్డును సింగరేణి డే సందర్బంగా జీఎం దేవేందర్ అందజేశారు. జీఎం మాట్లాడుతూ విధుల్లో క్రమశిక్షణతోపాటు ప్రమాదరహిత ఉత్పత్తి, సమయపాలన పాటించడంతోనే సారయ్య ఈ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షలాది మందికి అన్నం పెడుతున్న సింగరేణి సంస్థను అభివృద్ధిపథంలో నడిపేం దుకు కార్మికులందరూ కృషి చేస్తున్నారన్నారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని ఆయన అన్నారు.

కలిసిరాని కాలం


తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

పత్రాలు లేని కౌలు రైతులు సీసీఐకి అమ్ముకోలేక వ్యాపారులకు రూ. 6,800లకు విక్రయించి క్వింటాలుకు రూ. 700ల వరకు నష్టపోతున్నారు.

మామిడి.. నష్టాలే దిగుబడి

మామిడి రైతులకు ఈ సంవత్సరం చేదు అనుభవాలను మిగిల్చింది. జిల్లాలో 18 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రతికూల వాతావరణంతో తోటలు అంతంతమాత్రంగా కాత కాశాయి. పంటకాలంలో మూడు సార్లు వచ్చిన గాలిదుమారం కాయలను నేలపాలు చేశాయి. సీజన్ ప్రారంభంలో బంగినపల్లికి కిలోకు రూ.70 పలికినప్పటికి కొన్ని రోజులకే రూ. 35కి పడిపోయింది. చిన్న రసాలు, పెద్దరసాలు, తోతపరి, నీలం, పంచదార, సుందరి లాంటి ఇతర రకాలకు హోల్‌సెల్‌లో కిలోకు రూ.30 వరకు ఉండాల్సింది.. రూ.20 మాత్రమే చేతికొచ్చాయి. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక ఇక్కడి రైతులు మహారాష్ట్రలోని నాగపూర్‌లో విక్రయించి నష్టపోతున్నారు.

కూరగాయలు, పప్పుదినుసుల సాగులో మిశ్రమ ఫలితాలు

పప్పు దినుసుల సాగు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికి ప్రయోజనం చేకూరడం లేదు. ఆశించిన మేర పంట విస్తీర్ణం పెరగడం లేదు. మంచి ధర ఉన్నప్పటికి కంది పంట 8 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. పెసర, మినుములు తదితరాల సాగు అంతంత మాత్రంగానే ఉన్నది. కూరగాయల సాగు రైతులకు మిశ్రమ ఫలితాలనిచ్చింది. కూరగాయాల రైతులు ఏడాది ప్రారంభంలో కొంత లాభాలు ఆర్జించినప్పటికి ఆ తరువాత ధరలు పూర్తిగా పడిపోయాయి. టమాట, పచ్చిమిర్చి రూ.80 నుంచి ఏకంగా రూ.30కి పడిపోయింది. రైతులందరి పంటలు ఒకే సారి చేతికి రావడంతో ధరలు నేల చూపులు చూశాయి.

రైతుభరోసా రాలే... రుణమాఫీ కాలే..



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పేరిట ఎకరానికి రూ.15 వేలు అందజేస్తామని ప్రకటించినప్పటికి వానాకాలం సీజన్ ముగిసి యాసంగి వచ్చినప్పటికి పథకం అమలుకు నోచుకోలేదు. దీంతో పంట పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులతో పాటు భార్యభర్తల పేరిట ఉన్న రుణం, రేషన్‌కార్డు లేని వారు, ఆధార్‌కార్డు లింకేజీ, పాసుపుస్తకంలో తప్పొప్పులు తదితర కారణాలతో రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షల లోపు రుణం ఉండి వివిధ కారణాలతో రుణ మాఫీ కాకుండా అర్హులైన రైతుల వివరాలు సేకరించి జాబితా సిద్ధం చేసినప్పటికి మాఫీ డబ్బులు ఖాతాల్లో జమ కాలేదు. జిల్లాలో నాలుగు విడతల్లో మొత్తం 65,176 మంది రైతులకు రూ. 550కోట్ల 72 లక్షల 67 వేలు రుణమాఫీ అయింది. కుటుంబ నిర్ధారణ పేరిట 15,542 మంది రైతులకు, ఇతర కారణాల వల్ల 242 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వివిధ కారణాలతో రుణ మాఫీ కాని అర్హులైన రైతుల జాబితా ప్రకటించినప్పటికి వారి ఖాతాల్లో నగదు మాత్రం జమ కాలేదు.

డెలివరీ బాయ్స్‌కు డిమాండ్

ఫుడ్ నుంచి ఈ కామర్స్ వరకు ఆన్‌లైన్‌లో ఆర్డర్లు

రోజురోజుకు పెరుగుతున్న కొనుగోళ్లు

డెలివరీ చేస్తూ ఉపాధి పొందుతున్న యువకులు


ఆన్‌లైన్‌లో ఆర్డరు చేసుకున్న వారికి డెలివరీ చేస్తున్న డెలివరీ బాయ్స్

బెల్లంపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ షాపింగ్ పెరిగిపోయింది... దీంతో డెలివరీ బాయ్స్‌కు డిమాండ్ ఏర్పడింది. గతంలో ఏ సరుకులు కావాలన్నా బయటకు వెళ్ళి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తూ ఇంటి ముందుకు తెప్పించుకుంటున్నారు. ఆహారం, కిరాణ సామగ్రి, రెడీమెడ్ దుస్తులు, మందులు ఇలా ఏ వస్తువైనా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు చేసే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అందుకు తగినట్లుగానే వస్తువులను డోర్ డెలివరీ చేసేందుకు ఆయా సంస్థలు డెలివరీ బాయ్స్‌ను నియమించుకుంటున్నారు. ఆర్డరు చేసిన వారికి వస్తువులు చేరుస్తూ యువత ఉపాధి పొందుతున్నారు

ఆహారం నుంచి దుస్తుల వరకు ఆన్‌లైన్‌లోనే...

ఉరుకుల పరుగుల జీవితంలో ఇంటి వద్ద నుంచే తమకు కావాల్సిన వస్తువులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఆన్‌లైన్ సేవలు అందించేందుకు పదుల సంఖ్యలో యాప్‌లు వెలుస్తున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు బెల్లంపల్లి, మంద మర్రి, నస్పూర్, శ్రీరాంపూర్, లక్సెట్టిపేట, చెన్నూరు వంటి పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లో సైతం పలు ఆన్‌లైన్ సేవలు అందించే సంస్థలు వారి బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 50కి పైగానే బ్రాంచ్‌లు ఉన్నాయి.



పెరుగుతున్న ఫుడ్ అండ్ కిరాణ డెలివరీ యాప్‌లు

ఆన్‌లైన్‌లో ఎలక్ట్రిక్, రెడీమేడ్ దుస్తులు, హోంనీడ్స్ ఆర్డరు చేసేవారు. ఇటీవల కాలంలో రెస్టారెంట్లు, హోటళ్లలో నుంచి వారికి కావాల్సిన ఆహార పదార్థాలను యాప్‌లలో ఆర్డరు చేసుకుని ఇంటి వద్దకే తెప్పించుకుంటున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, కిరాణం షాపులు, సూపర్ మార్కెట్‌లు, మెడికల్ షాపుల వారు ఆన్‌లైన్‌లో ఆర్డర్లు రాగానే డెలివరీ బాయ్స్ సహాయంతో డెలివరీ చేస్తున్నారు.

డెలివరీ బాయ్స్‌కు పెరుగుతున్న డిమాండ్

డెలివరీ బాయ్స్‌కు డిమాండ్ ఏర్పడుతుంది. జిల్లాలో డోర్ డెలివరీ చేసే సంస్థలు ఈ కార్టు డెలివరీ, అమెజాన్, షాడోఫెక్స్, ఎక్స్ ప్రెస్‌బీస్, బ్లూడార్టు, వాల్‌మో, ఈకామ్‌ఎక్స్ ప్రెస్, ఫ్లిప్‌కార్ట్, మీషో, స్విగ్గీ, జొమాటో వీటితో పాటు ఆయా సూపర్ మార్కెట్‌లు, కిరాణం షాపులు, మెడికల్ షాపుల వారు సొంత యాప్‌లను ఏర్పాటు చేసు కుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 50కి పైగా ఆయా కంపెనీల బ్రాంచ్‌లు ఉండగా 4 వేల మందికి పైగా డెలివరీ బాయ్స్ సేవలంది స్తున్నారు. లోకల్, లాంగ్‌రూట్‌ను బట్టి ఒక్కో పార్శిల్‌పై రూ. 14 నుంచి 20 వరకు కమీషన్ ఇస్తున్నాయి. డెలివరీ బాయ్స్ వయస్సు, డ్రైవింగ్ లైసెన్స్, స్మార్ట్‌ఫోన్, బైక్ తప్పనిసరిగా ఉండాలి. పార్శిల్ డెలివరీ చేస్తేనే డెలివరీ బాయ్స్‌కు కమీషన్ వస్తుంది. ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరుగుతుండడంతో డెలివరీ బాయ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది.

ఉపాధి పొందుతున్నాను: పుల్లూరి రాములు, బెల్లంపల్లి



రెండు సంవత్సరాల నుంచి డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నా. నెలకు దాదాపు రూ. 15 వేలకు పైగా సంపాదిస్తున్నా. కొందరు ఆర్డరు ఇచ్చి క్యాన్సల్ చేయడం ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇన్‌టైమ్‌లో ఆర్డర్ చేయడమే లక్ష్యంగా డెలివరీ బాయ్స్ ముందుకు వెళ్తారు. సరైన సమయానికి కొందరు ఫోన్‌లో రెస్పాండ్ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

పరుగుల జీవితం: శివలక్ష్మన్, డెలివరీ బాయ్, బెల్లంపల్లి



డెలివరీ బాయ్‌గా రెండు సంవత్సరాల పనిచేస్తున్నా. వ్యవసాయ పనులు చేస్తూ పార్ట్‌టైంగా డెలివరీ బాయ్‌గా చేస్తున్నా. రోజు వివిధ వస్తువులు 40 నుంచి 50 ఆర్డర్లు చేస్తా. నెలకు రూ.16 వేల వరకు కమీషన్ వస్తుంది. ఆర్డర్లు సూచించిన సమయానికి పార్శిల్ డెలివరీ చేయాలి. పలు సమస్యలు ఎదురైనా ఉరుకులు పరుగుల మీద వెళ్లి డెలివరీ చేస్తుంటాం.

ఇబ్బందులు ఉంటున్నాయి: సూర్యకుమార్, డెలివరీ బాయ్ టీం మేనేజర్



డెలివరీ బాయ్‌గా పనిచేసి ప్రస్తుతం టీం మేనేజర్‌గా ఉన్నా. ఏడు సంవత్సరాలుగా ఆన్‌లైన్ డెలివరీలకు సంబంధించిన పని చేస్తు న్నాను. గతంలో నాకు ఒక్కో ఆర్డరుపై రూ.30 కమీషన్ వచ్చేది. ఆరు సంవత్సరాల పాటు డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నా. ప్రస్తుతం టీం మేనేజర్ కావడంతో రూ. 24 వేల వేతనం వస్తుంది. డెలివరీ చేసే సమయంలో ఆర్డరు పెట్టిన వారు ఫోన్ నెంబరు, అడ్రసులు సరిగ్గా ఇవ్వకపోవడంతో ఒక్కోసారి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆర్డరు డెలివరీ చేస్తేనే కమీషన్ వస్తుంది.

ఎంతో మందికి ఉపాధి: సాయినాథరాజు,షాప్స్‌అండ్‌మీ నిర్వాహకుడు



డెలివరీ బాయ్స్‌గా కొందరు ఫుల్ టైం, మరికొందరు పార్ట్‌టైంగా ఉపాధి పొందుతున్నారు. ఆహార పదార్థాలు, కిరాణ సామగ్రి, మెడికల్ వంటి వాటిని డెలివరీ చేస్తున్నాం. స్థానికంగా షాప్స్‌అండ్‌మి ద్వారా డెలివరీ బాయ్స్‌ను నియమించి పట్టణంలోని రెస్టారెంట్లు, హోటళ్లతో టైఅప్ అయి సేవలందిస్తున్నాం.



న్యూస్ బాక్స్

భగవద్గీత పుస్తకాల పంపిణీ

గర్మిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భక్తాంజనేయ ఆలయంలో హిందూ పరిరక్షణ వేదిక ప్రధాన కార్య దర్శి తుల ఆంజనేయులు అయ్యప్ప స్వాములకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదవడం ద్వారా మనిషి వ్యక్తి త్వ వికాసం, మంచి లక్షణాలు పెరు గుతాయని తెలిపారు. భగవద్గీతను అం దరు చదవాలని పుస్తకాలను అందిం చారు. అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ రీఅడ్మిషన్‌కు సంప్రదించాలి

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 26 (ఆం ధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో డిగ్రీ విద్యనభ్యసించి మధ్యలో విద్యా సంవత్సరం పూర్తి చేయకుండా ఉన్న విద్యార్థులు 2,4, 6 సెమిస్టర్లలో రీ అడ్మిషన్ పొందడానికి సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మధ్యలోనే ఆపేసిన విద్యార్థులకు ఇది ఒక మంచి అవ కాశమని సద్వినియోగం చేసుకోవాల న్నారు. వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఆర్థిక సహాయం

జన్నారం, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): రాంపూర్ గ్రామానికి చెందిన నిరుపేద తరాజుల నర్సవ్వ కూతురు కళ్యాణి వివాహానికి రాంపూర్ తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయ కులు గురువారం రూ.5 వేల ఆర్థిక సహా యం అందజేశారు. గ్రామ కమిటీ అధ్య క్షుడు లింగాల వెంకటేష్, గజెల్లి ఇజ్రాయెల్, సంగెపు వెంకటేష్, శ్రావణ్, కృష్ణ, భార్గవ్ పాల్గొన్నారు.

నేడు గూడెం అయ్యప్ప ఆలయంలో మహా పడిపూజ

దండేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): గూడెం అయ్యప్ప ఆలయంలో శుక్రవారం స్వామికి పుష్పాభిషేకం, దివ్య పదునెట్టంబడి మహా మండల పడిపూజ, మహాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, గురు స్వామి పురుషోత్తమచార్యులు గురువా రం తెలిపారు. పడి పూజ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. అయ్యప్ప స్వాములు, భక్తులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అటవీ సంరక్షణకు బాధ్యతగా పనిచేయాలి



అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ సువర్ణ

జన్నారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ కోసం ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (కంపా) అధికారి డాక్టర్ సువర్ణ అన్నారు. గురువారం కవ్వాల అటవీ ప్రాంతంలోని జన్నారం డివిజన్‌లోని రేంజ్‌లలో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. అడవిలో జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించారు. అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కవ్వాల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులు, ప్రకృతి వైవిధ్యం బాగుందందన్నారు. అడవి సంరక్షణ అందరిబాధ్యత అని పేర్కొన్నారు. ఆమె వెంట డీఎఫ్‌వో, ఎఫ్ఆర్‌వోలు, సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు

వేమనపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి మండలం ఒడ్డుగూడెం అటవీ ప్రాంతంలోని మత్తడి ఒర్రెలో గురువారం అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణానికి సదరు కాంట్రాక్టర్ ఒర్రెలో ఎక్స్‌కావేటర్ ద్వారా ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా కాలువ నిర్మాణానికి తరలిస్తుండగా గ్రామస్థులు ఫొటోలు తీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. రెండు రోజుల నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రిజర్వు ఫారెస్టులో ఉండే ఈ ఒర్రె నుంచి అక్రమంగా ఇసుకను తీసుకువెళ్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమంగా తరలి పోతున్న విషయంపై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని స్థానికులు చెప్పారు. ఈ విషయంపై కుష్నపల్లి ఎఫ్ఆర్‌వో దయాకర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మత్తడి ఒర్రె నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్‌లు కల్పించాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయకోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ, జిల్లా మహిళ నాయకురాలు బానోత్ సుశీల తెలిపారు. గురువారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.పూర్తిగా నడవలేని దివ్యాంగులకు రూ.15 వేల పింఛన్, మూడు చక్రాల వాహనాలు అందించాలన్నారు. ప్రభుత్వం ఇస్తానన్న రూ.6 వేల పింఛన్ అమలు చేయాలన్నారు. అప్పారావు, రమేష్, లక్ష్మణ్, రామ్‌శ్రీనివాస్, షేక్‌రావు, సుధాకర్ , లక్ష్మణ్, పాల్గొన్నారు.

మందమర్రిలో అయ్యప్ప భక్తుల శోభాయాత్ర


మందమర్రిలో అయ్యప్ప భక్తుల శోభాయాత్ర

మందమర్రి టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం రాత్రి అయ్యప్ప భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప స్వామి చిత్రపటాలతో ఊరేగింపు చేపట్టారు. అయ్యప్ప ఆలయం నుంచి మొదలుకొని మందమర్రి మార్కెట్ మీదుగా కొనసాగింది. గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం నిర్వహిస్తున్న మండల పూజ కార్యక్రమానికి భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు గురువారం పేర్కొన్నారు.

నేడు పులిమడుగులో ఎమ్మెల్యే పర్యటన

మందమర్రిరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిమడుగు గ్రామపంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు గండె రాంచందర్, ఒడ్నాల కొమురయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప పడి పూజలో పాల్గొంటారని తెలిపారు.

కమిషనరేట్‌లో ప్రెస్ సంబంధాలపై కట్టడి

విభాగాలకు సర్క్యులర్ జారీ

కోల్‌సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ప్రెస్‌కు దూరంగా ఉండాలంటూ నిబంధన పెట్టారు. ఈ మేరకు కమిషనరేట్‌లోని వివిధ విభాగాలకు ఇటీవలే సర్క్యులర్ జారీ చేశారు. యూనిట్ అధికారి అనుమతి లేకుండా ఎవరూ కూడా ప్రెస్‌కు సమాచారం ఇవ్వవద్దని, వారితో విషయాలు పంచుకోవద్దంటూ ఆదేశాలు ఇచ్చారు. రామగుండం పోలీస్ కమిషరేట్‌లో ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, సీసీఆర్‌బీ, ఎస్ఐబీ, సీసీఎస్, సైబర్ క్రైమ్, తదితర విభాగాలుంటాయి. అడ్మినిస్ట్రేషన్ అధికారి పర్యవేక్షణలో కార్యాలయ నిర్వహణ ఉంటుంది. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని ఆర్మ్‌డ్, సివిల్ విభాగాల పర్యవేక్షణ అంతా కమిషరేట్ నుంచే సాగుతుంది. ఇందుకుగాను అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సహాయకారిగా ఉంటారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. ముఖ్యంగా మంచిర్యాల జిల్లాకు సంబంధించి ఆర్థిక నేరాలు, పేకాట స్థావరాల నిర్వహణ, అక్రమ దందాల విషయంలో పోలీస్‌శాఖపై సైతం అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు ఇంటలీజెన్స్ విచారణ కూడా జరిగింది. ఈ పరిస్థితుల్లో సమాచారం లీక్ కాకుండా కమిషనరేట్ విభాగాలను కట్టడి చేసినట్టు తెలుస్తుంది. ప్రత్యేకంగా నిబంధన పెట్టడం ఇప్పుడు కమిషనరేట్‌లో చర్చనీయాంశం అయ్యింది.

మహాసభల పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

జన్నారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ పట్టణంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఆరవ మహాసభల పోస్టర్లను జన్నారంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, గుర్రాల రాజవేణులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. మహాసభల్లో జిల్లాలలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు జిల్లపెల్లి బాపు, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యక్షులు కాంతారావు పాల్గొన్నారు.

కాలిపోయిన ఎత్తిపోతల పథకం పైపులు

దండేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం-రంగంపల్లి గ్రామాల మధ్యలో గల సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం తొలగించిన పాత పైపులకు గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. పైపులకు మంటలు వ్యాప్తించి ఎగిసిపడటంతో గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ వచ్చి పాత పైపులపై ఎగిసిపడుతున్న మంటలను ఫైర్ సిబ్బంది అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. దీంతో కొంత మేరకు పాత పైపులు కాలిపోయాయి. దానిపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.



నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీపీఎం వేణుగోపాల్

దండేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఏ డీపీఎం వేణుగోపాల్ సూచించారు. నెల్కివెంకటాపూర్, మదాపూర్, ధర్మారావుపేట, పెద్దపేట, లక్ష్మీకాంతపూర్ గ్రామాల్లో గురువారం కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం మద్దతు ధరతోపాటు సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లుకు తర లించాలన్నారు. ఐకేపీ సీసీ మూల తిరుపతిగౌడ్, గ్రామైఖ్య సంఘాల లీడర్లు, వీవోఏలు, ఉన్నారు.

ట్రైనీ బీట్ అధికారుల పర్యటన


ట్రైనీ బీట్ అధికారులకు సూచనలు ఇస్తున్న అటవీ అధికారులు

జన్నారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లో 36వ బ్యాచ్ ట్రైనీ బీట్ అధికారులు గురువారం పర్యటించారు. బైసన్‌కుంట, బేస్ క్యాంపు, గర్షటపేట్, బటర్‌ఫ్లై గార్డెన్, ఈఈసీతోపాటు గ్రాస్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఎఫ్ఆర్‌వోలు సుష్మారావు, శ్రీనివాస్‌లు గడ్డి క్షేత్రాల గురించి వివరించారు. లాలుబాయి, శ్రీనివాస్, రహీం పాల్గొన్నారు.

వీర బాలుర జీవితచరిత్ర స్ఫూర్తిదాయకం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారతదేశపౌరులకు వీరబాలుర జీవితచరిత్ర స్ఫూర్తిదాయకమని బీజేపీజిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక గురుద్వారలో ఆయన ప్రత్యేకపూజలు చేశారు. దేశప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపుమేరకు వీర బాలదివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రిటైర్డ్ఆర్మీ అసోసియేషన్ సభ్యులు, గురుద్వార సభ్యులు పాల్గొన్నారు.

బూరేపల్లి వద్ద.. ప్రాణహిత బ్యారేజీ

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది



- కొత్తప్రతిపాదనలతో ముందుకు వచ్చిన ప్రభుత్వం
- బూరేపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణానికి సర్వేలు
- గతంలో కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద నిర్మాణానికి ప్రతిపాదనలు
- అయోమయానికి గురవుతున్న రైతులు

కౌటాల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టు (ప్రాణహిత)ను చేపట్టేందుకు అడుగులు వేస్తోంది. ఇందుకోసం 165టీఎంసీ(వెయ్యి మిలియన్ క్యూబిక్ ఫీట్)ల నీటి లభ్యత ఉండే ప్రాంతమైన చింతలమానేపల్లి మండలం బూరేపల్లి గ్రామాన్ని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) అధికారులు గుర్తించారు. ఈ మేరకు మూడునెలల క్రితమే సర్వే కూడా చేపట్టి ప్రభుత్వానికి నివేదికలను అందజేసినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో బ్యారేజీ నిర్మిస్తే 165టీఎంసీల నీటిలభ్యత ఉంటుందని, ఉమ్మడిజిల్లాలో 20 టీఎంసీలను వాడేందుకు అవకాశాలున్నాయని, మిగిలిన 145 టీసీఎంలు శ్రీపాద ఎల్లంపల్లి సాగర్‌కు తరలించే ఒడుకు వీలుంటుందని అధికారులు నివేదిక రూపొందించారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు కింది భాగానికి ప్రాణహిత నీటిని అందించే అవకాశం ఉందని, బూరెపల్లి వద్ద బ్యారేజీకి వ్యయం రూ.4వేల కోట్లు అవుతుందని, కరెంటు బిల్లులు కూడా 50శాతం ఆదా అవుతుందని ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ బ్యారేజి పూర్తి చేస్తే 16లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని, మహారాష్ట్ర నుంచి అనుమతుల ఇబ్బందులుండవని, అటవీ శాఖ అనుమతుల సమస్యలు కూడా ఉత్పన్నం కాదని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.అయితే మొదట ఈప్రాజెక్టును కౌటాల మండలం తుమ్మి డిహెట్టి వద్ద నిర్మించాల నుకుని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008డిసెంబరులో శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పుడు ప్రాణహిత బ్యారేజీ నిర్మాణంపై మళ్లీ కొత్తస్థలం తెరమీదికి రావటం రైతుల్లో చర్చనీయాంశం అయింది. ఏదిఏమైనా పనులు త్వరగా పూర్తిచేస్తే ఈప్రాంతం సస్యశ్యామలం అయ్యే అవకాశాలున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

● ఆది నుంచి ఆటంకాలే..

2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రాణహితపై ప్రాజెక్టు నిర్మించాలని భావించి రన్‌వెల్లి వద్ద సర్వే చేపట్టారు. అనంతరం తుమ్మిహెట్టికి మార్పుచేసి 2008డిసెంబరులో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.37వేల కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అప్పట్లో దీనికి అనుగుణంగా కాల్వలను కూడా తవ్వారు. ఆ తర్వాత ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం కావడం, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాయి. తుమ్మిహెట్టి వద్ద ప్రాజెక్టుకు సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతుల సమస్యలు వస్తుండడంతో ఇక్కడి నుంచి ప్రాజెక్టును మేడిగడ్డ కాళేశ్వరంకు తరలించారు. ప్రాజెక్టుకు రీడిజైన్ చేసి రూ.1.50లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన విషయం తెలిసిందే. దీంతో తుమ్మిహెట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు పూర్తిగా మరుగునపడింది. అంబేద్కర్ పేరున ఉన్న ప్రాజెక్టును విస్మరిస్తున్నారని ఇక్కడి ప్రజలు ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును కుదించి గుండాయిపేట వీర్దండి మధ్యలో నిర్మించేందుకు ప్రయత్నాలు చే సింది. దానికి అను గుణంగా 2022లో అప్పటి మంత్రి ఐకేరెడ్డి, ప్రభుత్వ ప్రతినిధి స్మితా సబర్వాల్ ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించి ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. 1.50లక్షల ఎకరాలకు నీరందించేలా పాత ప్రాజెక్టు (అంబేద్కర్ సులజ స్రవంతి)ను రీడిజైన్ చేస్తామని ప్రకటించారు. కాగా ఈ ప్రాజెక్టు నిర్మాణం స్థలం మొదట రన్‌వల్లి, తర్వాత తుమ్మిహేట్టి, ఆ తర్వాత గుండాయిపేట, ప్రస్తుతం బూరెపల్లికి మారటంతో ఈ ప్రాంత ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

గతంలో టేకంగూడెం, రన్‌వెల్లి ప్రాంతంలో తవ్విన కాల్వల పరిస్థితి ఏమి టనీ ప్రజలు, భూములు కోల్పో యిన రైతులు ప్రశ్నిస్తున్నారు. కోట్లాది రూ పాయల నిధులతో కాల్వలు తవ్వి ప్రజాధనం వృథా చేశారని, అధికారుల అనాలోచిత నిర్ణయాలపైఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తుమ్మిహేట్టి వద్దనే నిర్మించాలి..



-ప్రకాష్, తుమ్మిహేట్టి

మహారాష్ట్రలోని ఆస్టి నుంచి వచ్చే వైన్‌గంగా, తెలంగాణ రాష్ట్రంలోని పెన్‌గంగ కలిసే ప్రాంతమైన తుమ్మిహేట్టి వద్దనే ప్రాజెక్టు నిర్మిస్తేనే ఉపయోగం ఉంటుంది. నీటి లభ్యత పుష్కలంగా ఉంది. గంగా దాటితే మహారాష్ట్ర రావటంతో రాకపోకలకు చక్కటి మార్గం ఉంటుంది. అధికారులు ఇక్కడే ప్రాజెక్టు నిర్మిస్తే బాగుంటుంది. మా భూములను కూడా ప్రభుత్వానికి అప్పజెప్పాం. అధికారులు స్పందించి పునఃసమీక్షించి ప్రాజెక్టును తుమ్మిహేట్టి వద్దనే నిర్మించాలి.

సర్వేలతోనే సరిపోతోంది..



-అంజనేయులు గౌడ్, తుమ్మిహేట్టి

ఈ ప్రాజెక్టు నిర్మాణం కేవలం సర్వేలతోనే సరిపోతోంది. ఈ ప్రాజెక్టు పూర్తిచేస్తే ఎంతో బాగుపడుతుందని అనుకున్నప్పటికీ ఎక్కడ నిర్మిస్తారన్నది ఇప్పటికీ స్పష్టత లేదు. 17సంవత్సరాలుగా ఇక్కడే నిర్మిస్తామని చెప్పి ఇంతవరకు నిర్మించలేదు. కాళేశ్వరానికి తరలించి ఈప్రాంతం వారికి పూర్తిగా అన్యాయం చేశారు. వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశాలున్నప్పటికీ అన్యాయంగా జరిగింది.

త్వరగా ప్రాజెక్టును చేపట్టాలి..



-మనీష్, మొగడ్‌ధగడ్

ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును త్వరగా చేపట్టాలి. గతంలో తుమ్మిహేట్టి వద్ద నిర్మించేందుకు భారీ కాల్వలు కూడా తవ్వారు. అధికారులు ఇక్కడే నిర్మిస్తే ఖర్చు తగ్గుతుంది. నీటి లభ్యత అధికంగా ఉంది. అధికారులు ఇక్కడ ప్రాజెక్టు చేపడితే రెండు రాష్ట్రాలకు అభివృద్ధి బాటలు పడే అవకాశం ఉంది.

కెరమెరికి చేరుకున్న రగ్‌జోల్ యాత్ర



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్

కెరమెరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): లంబాడ హక్కుల సాధన ఐక్యతకోసం సేవాలాల్‌సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రగ్‌జోల్ యాత్ర గురువారం కెరమెరిమండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సేవాలాల్ సేన రాష్ట్రఅధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్ మాట్లాడుతూ లంబాడ హక్కుల కోసం అందరూ సంఘటితంగా పోరాటాలు చేయాలని పిలు పునిచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు రూప్‌లాల్‌నాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, తిరుపతి, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

31వరకు టీజీ బ్యాంకు సేవలు బంద్

వాంకిడి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణబ్యాంకు సేవలు ఈనెల 28నుంచి 31వరకు నిలిపివేయనున్నట్లు రీజనల్ మేనేజర్ ప్రభుదాస్, వాంకిడి బ్రాంచిమేనేజర్ జాడికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణవికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) శాఖలు 2025సంవత్సరం నుంచి తెలంగాణ గ్రామీణబ్యాంకులో విలీనం అవుతున్నందన టీజీబీబ్యాంకు పరిధిలోని అన్నిరకాల లావాదేవీలు నిలిపివేస్తున్నామన్నారు. తిరిగి జనవరి1 నుంచి సేవలు పునఃప్రారంభిస్తామన్నారు.

హిందీటీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన హిందీ బోధించుటకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సి పాల్ మహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఒక పోస్టు ఖాళీగా ఉందన్నారు. హెచ్‌పీటీ, పీజీ ఉండి, టెట్‌లో క్వాలిఫై అయిన వారు ఈనెల31వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన



నగర సంకీర్తనలో అయ్యప్ప స్వాములు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలో గురువారం అయ్యప్పస్వాములు నగరసంకీర్తన చేపట్టారు. కన్యకాపరమేశ్వరి ఆలయంనుంచి అయ్యప్ప ఆలయం వరకు పల్లకీలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని పెట్టి ఊరేగించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు నళిని మోహన్, ఖాండ్రే కిషన్, చంద్రమోహన్, మడావి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు

కాగజ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ అయ్యప్ప ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఎమ్మెల్యే హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండేవిఠల్ పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయకమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు, ఆలయ కమిటీసభ్యులు, ఆయాపార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర రూ.50 తగ్గింపు

జైనూర్, డిసెంబరు26 డిసెంబరు,(ఆంధ్రజ్యోతి): స్థానిక జిన్నింగ్ ఫ్యాక్టరీలలో సీసీఐ ద్వారా కొనుగోలు చేపడుతున్న పత్తికి మద్దతు ధర రూ.50 తగ్గించామని రైతులు గమనించాలని జైనూర్ మార్కెట్ కార్యదర్శి ఇర్ఫాన్‌అహ్మద్ కోరారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో పత్తికి మద్దతుధరను తగ్గించామన్నారు. అదేవిధంగా శుక్రవారం నుంచి స్థానిక స్టార్, సర్రన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలలో కూడా క్వింటాలుకు 50రూపాయలు తగ్గించి 7471 రూపాయలకు పత్తి సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీఎమ్మెల్యే

బెజ్జూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలం సుస్మీర్ గ్రామానికి చెందిన ఆలం భీంరావు, మొగవెల్లికి చెందిన ఆత్రం అమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం బాధిత కుటుంబాలను మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదివాసీభవన్‌లో గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ఆయనవెంట డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య, నాయకులు బషరత్‌ఖాన్, వెంకన్న, అమీరుద్దీన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

చీపుర్లతో ఊడుస్తూ ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట చీపుర్లతో ఉడుస్తూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు చేపడుతున్న దీక్షలు గురువారం నాటికి 17వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చీపుర్లతో ఉడుస్తూ వినూత్నరీతిలో నిరసనవ్యక్తం చేశారు. దీక్షశిబిరాన్ని టీయూటీఎఫ్ నాయకులు సదాశివ్, వెంకట్‌రావు, ధన్‌రాజ్, జలపతి తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపి రూ.10వేల ఆర్థికసాయం చేశారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీఅభ్యర్థి డాక్టర్ ప్రసన్నహరికృష్ణ దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఎస్‌ఏ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేసి పేస్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు శృతిక, సంతోష్, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలి..

సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న పోరాటంపై సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ నాయకత్వంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన సొంతన్యూస్ ఛానల్‌లో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సమగ్రశిక్ష ఉద్యోగులు పేర్కొన్నారు. వెంటనే తీన్మార్ మల్లన్న ఉద్యోగులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సరిహద్దుల్లో పులి కలకలం

సిర్పూర్(టి), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై అమృత్‌గూడ సమీపంలో గురువారం వాహనదారులకు రోడ్డుపై పులి కనిపించింది. దీంతో అటుగా పంట పొలాలకు వెళ్లే రైతులు, వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారి అందరూ కేకలు వేయడంతో పులి మహారాష్ట్రలోని అమృత్‌గూడ అటవీ ప్రాంతంలోకి వెళ్లి పోయింది. మూడు రోజులక్రితం పత్తిచేనులో మహారాష్ట్రకు చెందిన వృద్ధురాలు లాలుబాయి(60)ని హతమార్చింది. తిరిగి గురువారం పులి కనిపించడంతో మహారాష్ట్రలో అమృత్‌గూడ, కవిట్‌పేట, వీరూర్, అంతర్‌గాం తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

కడంబా వైపు పులి..

పెంచికలపేట: గురువారం ఉదయం ట్రాకింగ్ చేస్తున్న అటవీశాఖ అధికారులు దర్గాపల్లి గ్రామశివారు అటవీప్రాంతంలో పులి పాదముద్రలను గుర్తించారు. అయితే అక్కడినుంచి అటవీప్రాంతం మీదుగా కాగజ్‌నగర్ రేంజ్‌పరిధిలోని కడంబా అటవీప్రాంతంలోకి పులి ప్రవేశించినట్లు అధికారులు తెలుపుతున్నారు. దీంతో అటవీ ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

మెడికల్‌షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం మెడ్‌ప్లస్ మెడికల్ షాప్‌ను ఎమ్మెల్యే హరీష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ సేవలను పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మెడ్‌ప్లస్ సిబ్బంది సిర్పూరు ఎమ్మెల్యేను ఘనంగా శాలువాలతో సన్మానించారు.

యువకుడికి సన్మానం

జైనూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలంలోని అల్లీనగర్‌కు చెందిన నిరుపేద ఆదివాసీ యువకుడు రాయసిడాం శ్రీహరిని గురువారం మండల కేంద్రంలో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర కార్యదర్శి కోట్నాక భీంరావ్ మాట్లాడుతూ శ్రీహరి చిన్నవయస్సులోనే తల్లిదండ్రులు చనిపోగా, అనేక ఇబ్బందులు ఎదుర్కొని సీఆర్టీగా విధులు నిర్వర్తిస్తూ వచ్చిన వేతనంతో ముందుకు సాగి పట్టుదలతో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడని కొనియాడారు.

ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

కౌటాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పిట్టల స్వాతి(22) గురువారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను సిర్పూరు సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి అప్పటికే స్వాతి మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా స్వాతి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. స్వాతి అవివాహితురాలు. ఈ మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఇటిక్యాలపహాడ్ గ్రామాన్ని సందర్శించిన పీసీసీఎఫ్



మ్యాపును పరిశీలిస్తున్న తెలంగాణ పీసీసీఎఫ్ సువర్ణ

సిర్పూర్(టి), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాలపహాడ్ గ్రామాన్ని తెలంగాణ పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్‌ఫారెస్ట్) చీఫ్ సువర్ణ బుధవారం సందర్శించారు. అటవీప్రాంతంలో కంపా (కంపెన్సేటరీ అఫోరెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ)నిధులతో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ని ఎకరాల్లో, ఎంత విస్తీర్ణంలో మొక్కలను పెంచారని ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్‌ను అడిగితెలుసుకున్నారు. మ్యాప్‌ద్వారా పులుల కారిడార్, తడోబా రహదారులను వివరించారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో ఇటీవల పులిదాడిలో మృతిచెందిన లక్ష్మితోపాటు సిర్పూర్(టి)కిచెందిన రౌతుసురేష్, మహారాష్ట్రలోని అమృత్‌గూడలో లాలుబాయి మృతిచెందగా సంఘటన వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఇటిక్యాల పహాడ్ గ్రామస్థులకు దుప్పట్లు పంపిణీచేశారు. ఆమెవెంట ఎఫ్‌డీటీ శాంతారాం, ఎఫ్‌డీవో నీరజ్‌కుమార్ టిబ్రెవాల్, ఎఫ్‌డీవో వినయ్ కుమార్‌సాహు, ఎఫ్ఆర్వో ఎక్బాల్‌హుస్సేన్, డిప్యూటీరేంజ్ అధికారి శ్రీధర్, ఎఫ్ఎస్‌వో మోహన్, నరేష్, తదితరులు ఉన్నారు.

ఉషోదయ వేళలో..అరుణ కిరణాలు..



ఉషోదయ వేళలో బానుడు మంచుదుప్పటిని తన అరుణ కిరణాలతో తొలగిస్తూ పరవశించిపోతున్నట్లు కనిపిస్తోన్న ఈ దృశ్యం గురువారం ఉదయం మండలకేంద్రంలో ఆవిష్కృతమైంది. రహదారికి ఇరువైపులాఉన్న చెట్ల మధ్య నుంచి సూర్యుడి లేలేత కిరణాలు భూమిని తాకుతున్న క్షణాలను అటుగా వెళ్తున్న యువకులు, మార్నింగ్ వాకర్స్ ఆస్వాదించారు.

- పెంచికలపేట

బాక్సింగ్‌తో శారీరక దారుఢ్యం..: సీఐ



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ నేర్చుకోవటం వలన శరీర దారుఢ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని పట్టణసీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం బాక్సింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్‌సిల్క్ ఎఫ్‌కాలనీలో ముత్తు మెమోరియల్ బాక్సింగ్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పట్టణసీఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాక్సింగ్ నేర్చుకోవటం వలన మానసికంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. అనంతరం క్రీడాకారులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ముత్తు బాక్సింగ్‌క్లబ్ అధ్యక్షుడు వేముర్ల మధు, ఆసిఫాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ శివకుమార్ నాయర్, ప్రధానకార్యదర్శి మధుశైఖర్, మాస్టర్ రమాకాంత్‌యాదవ్, ఉపాధ్యక్షుడు జయేందర్, ప్రొఫెసర్ వాలెంటీనా, జాకీర్, నాయకులు లలిత్, జబ్బి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐని సన్మానించారు.